# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...


TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ ఫిబ్రవరి 06 గురువారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 193

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## కుంభమేళాకు పోటెత్తుతున్న భక్తజనం

పుణ్యస్నానం ఆచరించిన ప్రధాని మోడీ



# కుల గణనలో పాల్గొనని వాళ్లు మళ్లీ వివరాలు ఇవ్వొచ్చు



- కులగణన జరగకుండా కుట్రల ప్రచారాన్ని తిప్పి కొట్టిన ప్రజలు
- కులగణన సర్వే చేసిన అధికార యంత్రాంగానికి అభినందనలు
- కులగణనకు సహకరించిన ప్రజలకు, మీడియాకు కృతజ్ఞతలు
- దేశం యావత్తూ తెలంగాణ వైపు చూస్తోందన్న భట్టి

**ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నేడు సీఎం భేటీకాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపా దాస్‌మున్షీ గురువారం ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.**

**హైదరాబాద్:** కులగణన సర్వే విజయవంతంగా పూర్తి చేసి అసెంబ్లీలో ప్రవేశపెట్టడం తో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తున్నదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సామాజిక న్యాయం అమలుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వే సమాచారాన్ని ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలకు, సామాజిక పరంగా తీసుకునే నిర్ణయాలకు తప్పనిసరిగా వాడుకుంటామని స్పష్టం చేశారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడారు. రాష్ట్రంలో కుల గణన సర్వే జరుగొద్దని కుట్ర దారులు తప్పుడు ప్రచారం చేసి సర్వేలో పాల్గొనద్దని పిలుపు ఇచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనను అర్థం చేసుకొని సర్వే విజయవంతం కావడానికి ప్రజలు సహకరించి దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టారన్నారు. కొన్ని దశాబ్దాలుగా కొన్ని వర్గాల ప్రజలు ఎదురు చూస్తున్న కుల గణన సర్వే పూర్తి చేసి చట్టసభలో ప్రవేశపెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. కులగణన చాలా పారదర్శకంగా, శాస్త్రీయంగా జరిగిందని వివరించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చడానికి కుల గణన సర్వే మొదలుపెట్టడానికి సుదీర్ఘంగా కసరత్తు చేశామని వివరించారు. 4 ఫిబ్రవరి 2024 న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని, 16 ఫిబ్రవరి 2024న అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశామన్నారు. 10 అక్టోబర్ 2024 న సర్వే కోసం జీవో విడుదల చేశామన్నారు. సర్వే పర్యవేక్షణకు సీనియర్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన 19 అక్టోబర్ 2024 న సబ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాను 150 కుటుంబాలతో కూడిన ఎన్యూమరేషన్ బ్లాక్ గా విభజించి తద్వారా 94,261 బ్లాక్ లను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా , 03, 889 ఎన్యుమరేటర్లు మరియు సూపర్వైజర్లను నియమించి వారికి శిక్షణ ఇచ్చి నిరంతరం ఈ పక్రియ విజయవంతంగా పూర్తి కావడం కోసం జిల్లా అడిషనల్ కలెక్టర్లను నోడల్ అధికారిగా నియామకం చేసి, జిల్లా కలెక్టర్ల నిరంతరం పర్యవేక్షణ చేసే విధంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మానిటరింగ్ చేసి పకడ్బందీగా సర్వే పూర్తి చేశామని వివరించారు. సర్వే రాష్ట్రంలోని ప్రజల వివిధ రకాల స్థితిగతులపై ఫుల్ బాడీ చెకప్, ఒక ఎక్సరే లాంటిదన్నారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో ఉందని ఈ సర్వే స్పష్టం చేస్తుందన్నారు. గత కులగణన సర్వేలో పాల్గొనని వారు ఇప్పుడు ఆసక్తి కనబరిచి సమాచారం ఇస్తే తీసుకునేందుకు ప్రభుత్వ సిద్ధంగా ఉన్నదని వెల్లడించారు. ఈ కులగణన సర్వే దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న సమస్యల పరిష్కార మార్గం చూపించే పక్రియగా ఉపయోగపడుతుందన్నారు. మరి కొద్ది రోజుల్లోనే మీడియా మిత్రుల సమావేశం నిర్వహించి కుల గణన సర్వేకు సంబంధించిన అంశాలను డిటైల్డ్ గా ప్రజెంటేషన్ చేసి ప్రజల ముందు ఉంచుతామన్నారు. సర్వే సక్సెస్ కావడానికి మెండుగా సహకరించిన ప్రజలకు, మీడియా మిత్రులకు, శాస్త్రీయంగా సర్వే చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ ఉన్నారు.

## బిసి కులగణన సర్వే తప్పుల తడక



**పార్లమెంట్ వేదికగా అబద్ధాలు చెప్పిన రాహుల్ అందుకు వెంటనే క్షమాపణలు చెప్పాలి రాహుల్‌కు లేఖ రాసిన కెటిఆర్..**

హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సర్వేలో బీసీ జనాభాను తగ్గించి వారిని దారుణంగా వెన్నుపోటు పొడిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తప్పులతడకగా లెక్కలు వేసి సర్వే పూర్తయిందని చెప్పడం ముమ్మాటికీ వెనకబడిన వర్గాలను మోసం చేయడమేనని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి కేటీఆర్ లేఖ రాశారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ కులగణన సర్వే పూర్తి చేసిందని లోక్ సభలో మీరు చెప్పడం పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించడమేనని కేటీఆర్ మండిపడ్డారు. లక్షలాది మంది వివరాలు సేకరించకుండా సర్వే ఎలా పూర్తవుతుందని రాహుల్‌ని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాట మాట్లాడే కాంగ్రెస్ నిజస్వరూపం ఏడాది కాలంగా అనేక రూపాల్లో బయటపడిందని కేటీఆర్ చెప్పుకొచ్చారు. బీసీల జనాభాను తగ్గించి చారిత్రక తప్పిదం చేసిన కాంగ్రెస్ పార్టీని తెలంగాణలోని వెనకబడిన వర్గాలు ఎప్పటికీ క్షమించవని కేటీఆర్ ధ్వజమెత్తారు. గ్యారెంటీల పేరిట చేసిన గారడీని, డిక్లరేషన్ పేరిట చేసిన ఈ దగాను చూసిన తర్వాత వచ్చే స్థానిక ఎన్నికల్లోనే కాదు.. ఏ ఎన్నికల్లోనూ ఇక కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మరని కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ వేదికగా బీసీ డిక్లరేషన్ ఓ నాటకమని, బీసీలకు స్థానిక ఎన్నికల్లో కల్పిస్తామన్న 42 శాతం రిజర్వేషన్ల హామీ బూటకమని తేలిపోయిందని చెప్పారు.




## రాజధాని ఢిల్లీలో ముగిసిన పోలింగ్

సాయంత్రం వరకు 57శాతం పోలింగ్ నమోదు

క్యూలో ఉన్నవారికి ఓటేసేలా చర్యలు

ఓటేసిన రాష్ట్రపతి ముర్ము సహా పలువురు ప్రముఖులు

## న్యూఢిల్లీలో పగ్గాలు బిజెపికే

అన్ని సర్వేల్లోనూ బిజెపికే మొగ్గు

ఎగ్జిట్ పోలస్ ప్రకటించిన ఆయా సంస్థలు




2లో..




## మళ్లీ స్పీడ్‌పెంచిన హైడ్రా

### ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద ప్రహరీల కూల్చివేత

**హైదరాబాద్:** కొద్ది రోజులుగా దూకుడు తగ్గించిన హైడ్రా మళ్లీ రంగంలోకి దిగింది. బుధవారం శంషాబాద్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు పక్కన ప్రహరీ గోడలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. సర్వే నంబర్లు 601, 602 లో చేపట్టిన ప్రహరీ గోడను తెల్లవారుజామున కూల్చివేశారు. వివాదాస్పద రోడ్డు స్థలం విషయంలో ఫిర్యాదులు రావడంతో కూల్చివేశారు. అయితే తమ పట్టా భూమిలో తాము నిర్మించుకున్న ప్రహరీ గోడను హైడ్రా అధికారులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కూల్చివేసారని బాధితులు మండిపడుతున్నారు. హైడ్రా అధికారుల తీరుపై న్యాయపోరాటం చేస్తామని బాధితులు ప్రకటించారు. కాగా నిర్మాణరంగ, ఇతర వ్యర్థాల అక్రమ డంపింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని హైడ్రా నిర్ణయించింది. చెరువులు, నాలాలు, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పోసే వాహనాలపై సంస్థ బృందాలు ప్రత్యేక నిఘా పెట్టాయి. పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి అక్రమంగా వ్యర్థాలు డంప్ చేస్తోన్న నాలుగు టిప్పర్లను హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలు పట్టుకున్నాయి. ఉందాసాగర్‌లో వ్యర్థాలు పోస్తున్న నాలుగు టిప్పర్లు, పోసిన మట్టిని వెంటనే చదును చేస్తోన్న ప్రొక్లెయినర్‌నూ పట్టుకున్నారు. అనంతరం బండ్లగూడ పోలీస్ స్టేషన్‌లో వాహనాలు, డ్రైవర్ క్లీనర్‌ను అప్పగించి వారిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవులపల్లి (సమర్‌కుంట) చెరువులో మట్టి పోస్తోన్న మరో లారీని పట్టుకున్నారు. వాహనం, డ్రైవర్, క్లీనర్‌ను పోలీసులకు అప్పగించారు. వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో మట్టి, ఇతర వ్యర్థాలు పోస్తే కేసులు నమోదు చేస్తామని, అన్ని ప్రాంతాల్లో హైడ్రా బృందాల నిఘా ఉందని కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు.

# సుప్రీం తీర్పుపైనే బిఆర్ఎస్ ఆశలు !

పార్టీలు మారడం తప్పే...ఒకపార్టీ నుంచి గెలిచిన వారు మరో పార్టీలోకి మారడం అన్నది సర్వసాధారణం అయ్యింది. రాజ్యాంగం ప్రకారం కఠిన నిబంధనలు లేకపోవడంతో జంపింగ్ జిలానీలు ఉండనే ఉంటున్నారు. అధికారంలో ఉన్న పార్టీకి సహజంగానే దుంకేస్తున్నారు. ఇంతకాలంగా ఇది నడుస్తూనే ఉంది. తాజాగా తెలంగాణలో పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో లొల్లి మొదలయ్యింది. దీనిపై బిఆర్ఎస్ పోరాడుతూనే ఉంది. చివరకు సుప్రీంలో కేసు వేసింది. ఇంతకాలం ఎందుకు చర్య తీసుకో లేదని తాజాగా సుప్రీం ప్రశ్నించడంతో తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి ఆ పదిమందికి నోటీసులు ఇచ్చారు. లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలన్నారు. ఇదంతా ఒక ఎత్తయితే గతంలో ఎమ్మెల్యేను గంపగుత్తగా పార్టీలో చేర్చుకుని కాంగ్రెస్, టిడిపి, సిపిఐలను దెబ్బకొట్టిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీది. తెలంగాణ పునరేకీకరణ పేరుతో నిస్సిగ్గుగా ఎమ్మెల్యేలను గోడదాటించారు. ఆనాడు వారి చేసివుండకపోయి వుంటే..ఇవాళ బిఆర్ఎస్ వాదనకు బలం ఉండేది.



నిజాయితీ ఉండేది. కానీ తొమ్మిదన్నరేళ్ల పాలనలో చేయని అరాచకం లేదు. తెలంగాణ రావడం ఆ కుటుంబం కోసమే అన్నట్లుగా పాలన సాగించారు. ఇష్టం వచ్చినట్లుగా అప్పులు చేసి, అభివృద్ధి ముసుగేశారు. దాదాపు 7 లక్షల కోట్లు అప్పులుచేసిన పెద్దాయన ఇప్పుడు అసెంబ్లీ మొహం చూడడం లేదు. ఫామ్‌హౌజ్ వీడి బయటకు రావడం లేదు. కేవలం ఆయన కొడుకు, కూతురు, అల్లుడు మాత్రమే రాజకీయాలు నడుపుతున్నారు. అసెంబ్లీలో కూడా అబద్దాలు చెప్పడం అలవాటు చేసుకున్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనపై దుమ్మెత్తి పోస్తున్నారు. ఉప ఎన్నికలకు సిద్దంగా ఉండండి అంటూ కెటిఆర్ పార్టీ శ్రేణులకు లీకులు ఇస్తున్నారు. తెలంగాణలో అధికారం కోల్పోయిన బిఆర్ఎస్, తరవాత పార్లమెంట్ ఎన్నికల్లో పూర్తిగా చతికిల పడ్డది. విజయం సాధించక పోవడంతో పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. పదిమంది పోయారనని సరిపెట్టుకోవడానికి కూడా లేదు. గతంలో టిఆర్ఎస్ ఆడిన విధంగానే కాంగ్రెస్ కూడగా పాచికలు వేస్తోంది.

## కుంభమేళాకు పోటెత్తుతున్న భక్తజనం

**ప్రయాగ్‌రాజ్:** అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహాకుంభ మేళా ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రతిరోజూ కోట్లాది మంది వచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. మౌని అమావాస్య రోజు జరిగిన దుర్ఘటన తప్ప అన్ని రోజులు సజావుగా సాగుతున్నాయి. తాజాగా ప్రధాని మోడీ కూడా బుధవారం పుణ్యస్నానం ఆచరించారు. భీష్మ అష్టమి సందర్భంగా ఆయన ప్రయాజ్ రాజ్ వచ్చి త్రివేణి సంగంలో స్నానమాచరించి, సూర్యుడికి తర్పణం వదిలారు. సరిగ్గా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ.. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు ప్రధాని మోదీ హాజరయ్యారు.ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న ప్రధాని మోదీ అక్కడి నుంచి అరైల్ ఘాట్‌కు వెళ్లారు. అరైల్ ఘాట్ నుంచి బోటులో ప్రయాణించి మహా కుంభమేళా జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం గంగా, యమునా, సరస్వతి త్రివేణి సంగమంలో ప్రధాని మోదీ పుణ్యస్నానం ఆచరించారు. తిరిగి బోటులో ఆ ప్రాంతం నుంచి అరైల్ ఘాట్‌కు చేరుకున్నారు. ఆ తర్వాత అరైల్ ఘాట్ నుంచి ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని.. అక్కడి నుంచి తిరిగి ఢిల్లీ బయల్దేరుతారు. మోదీ పర్యటన నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్ నగరంతోపాటు కుంభమేళా దగ్గర భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇక జనవరి 13న ప్రారంభమైన మహాకుంభమేళా ఈ నెల 26న మహా శివరాత్రి రోజున ముగియనుంది. ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో పుణ్యస్నానాలు చేసేందుకు త్రివేణి సంగమానికి పోటెత్తారు భక్తులు. ప్రయాగ్‌రాజ్ ఘాట్లన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఇప్పటి వరకు 38కోట్ల మంది కుంభమేళాకు వచ్చినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. సామాన్యులతోపాటు అనేక మంది ప్రముఖులు కూడా ఈ కుంభమేళాకు హాజరవుతున్నారు.

## రాజధాని ఢిల్లీలో ముగిసిన పోలింగ్

**న్యూఢిల్లీ:** దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది..సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి క్యూలో ఉన్నవారికి ఓటు వేసేందుకు అనుమతించారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు వరకు 57 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. పోలింగ్ సందర్భంగా ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఉద్రికత్త నెలకొంది.. ప్రధాన ప్రత్యర్థులు అయిన ఆప్, బీజేపీ పార్టీల నేతలు రిగ్గింగ్ జరిగిందంటూ ఆరోపణలు చేశారు. సీలంపూర్, జంగ్ పురాలో, చిరాగ్ ఢిల్లీలో పలు పోలింగ్ కేంద్రాల వద్ద గందరగోళ వాతావరణం ఏర్పడింది. కొన్ని చోట్ల ఇరు పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది. ఈశాన్య ఢిల్లీలో అత్యధికంగా 52.73 శాతం పోలింగ్ నమోదైంది. న్యూఢిల్లీ జిల్లాలో అత్యల్పంగా 43.1 శాతం పోలింగ్ నమోదైంది. ఈశాన్య ఢిల్లీలోని బాబర్‌పూర్ నియోజకవర్గంలో 51.74 శాతం పోలింగ్ నమోదు కాగా..మధ్య ఢిల్లీలోని కరోల్ బాగ్ నియోజకవర్గంలో మధ్యాహ్నం 3 గంటల వరకు 39 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల సంఘం తెలిపింది. ఉదయం ఏడు గంటలకు మొదలైన ఓటింగ్ పక్రియ 6గంటలకు ముగిసింది. సాయంత్రం
రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ, దిల్లీ సీఎం ఆతిశీ, కేంద్ర మంత్రి జై శంకర్ సహా పలువురు ప్రముఖులు తొలి గంటల్లోనే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కేజ్రీవాల్ కుటుంబంతో వచ్చి ఓటేశారు. ఈ అసెంబ్లీ ఎన్నికలతో పాటు తమిళనాడులోని ఈరోడ్(ఈస్ట్), ఉత్తర్‌ప్రదేశ్‌లోని మిల్కిపుర్‌లో ఉప ఎన్నికలు జరిగాయి. ఈరోడ్ ఈస్ట్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ మృతి చెందడంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. అయోధ్య జిల్లాలోని మిల్కిపుర్‌లో ఉప ఎన్నికను సమాజ్‌వాదీ పార్టీ, భాజపా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి.

## మళ్లీ అధికారం ఇక వైసిపిదే

**అమరావతి:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బతుకుతోందని.. ఈ రాష్ట్రాన్ని 30 ఏళ్ల పాటు ఏలుతోందని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ జోస్యం చెప్పారు. వచ్చేది వైసిపియేనని, అందరూ ధైర్యంగా ఉండాలన్నారు. అయితే పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బెదిరిస్తారు.. దొంగ కేసులు పెడతారు.. అలాగే జైల్లో సైతం పెడతారని.. అయినా రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తామని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. మీకు మంచి చేసిన వారినీ.. అలాగే చెడు చేసిన వారినీ.. ఇద్దరినీ గుర్తుపెట్టుకొండంటూ పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా వైఎస్ జగన్ కీలక సూచన చేశారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో విజయవాడ నగరపాలక సంస్థలోని వైసీపీ కార్పొరేటర్లతోపాటు ముఖ్య నాయకులతో మాజీ సీఎం వైఎస్ జగన్ సమావేశమయ్యారు. ఒక్కటే గుర్తు పెట్టుకొండంటూ పార్టీ కేడర్‌కు ఆయన కీలక సూచనలు చేశారు. ఈ జగన్ 2.0 వేరుగా ఉంటుందన్నారు. ఈసారి కార్యకర్తల కోసం జగన్ ఏం చేస్తాడో చూపిస్తాని తెలిపారు. గతంలో పార్టీ శ్రేణులకు అధిక ప్రాధాన్యత ఇవ్వ లేకపోయానని చెప్పారు.
అయితే పార్టీలోని కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని ఎవరిని వదిలిపెట్టమని వైఎస్ జగన్ హెచ్చరించారు. అక్రమ కేసులు పెట్టిన వారిపై ప్రైవేట్ కేసులు వేస్తామని స్పష్టం చేశారు. వారిని చట్టం ముందు నిలబెడతాంటూ వారికి వైఎస్ జగన్ భరోసా కల్పించారు. గత జగన్ ప్రభుత్వ హాయంలో కార్యకర్తలకు అంత గొప్పగా చేయ లేక పోయిండవచ్చు.. కానీ ప్రతి పథకం, ప్రతి విషయంలో మొట్టమొదటిగా ప్రజలే గుర్తుకు వచ్చారని.. వారి కోసమే తాను తాపత్రయపడ్డానని ఈ సందర్భంగా ఆయన వివరించారు. వారి కోసమే తన టైం కేటాయించానని.. ప్రజల కోసమే అడుగులు వేశానన్నారు. అయితే ప్రస్తుతం సీఎం చంద్రబాబు.. మన కార్యకర్తలను పెడుతున్న ఇబ్బందులు చూశానన్నారు. అలాగే
కార్యకర్తల బాధలను సైతం గమనించానని చెప్పారు. వారి అవస్థలను సైతం చూశానని..
వీళ్ల కోసం అండగా ఉంటాడని ఈ సందర్భంగా వైఎస్ జగన్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రతి నియోజకవర్గంలో పేకాట
క్లబ్‌లు నడుపుతున్నారన్నారు. మొన్నటి ఎన్నికల్లో కూటమి 164 స్థానాలను కైవసం చేసుకుంది. ఇక వైసీపీ కేవలం 11 సీట్లకు పరిమితమైంది. దీంతో ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా సైతం దక్కలేదు. అయినా తమ పార్టీకి ప్రతిపక్ష హోదా కల్పించాలంటూ స్పీకర్‌కు లేఖ రాశారు. సంఖ్య బలం లేకుండా ఆ హోదా ఇవ్వడం సాధ్యం కాదంటూ ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా కేటాయించే వరకు తనతోపాటు తన పార్టీ ఎమ్మెల్యేలు ఎవరు అసెంబ్లీలో అడుగు పెట్టమని వైఎస్ జగన్ కీలక ప్రకటన చేశారు. అంతేకాదు.. తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా కేటాయించాలంటూ వైఎస్ జగన్.. ఏపీ హైకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఇక 2019 ఎన్నికల్లో వైసీపీ 151 అసెంబ్లీ స్థానాలను గెలుచుకొంది. దీంతో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్.. అసెంబ్లీలో మూడు రాజధానుల ప్రకటన చేశారు. అదీకూడా ప్రతిపక్ష నేతగా రాజధాని అమరావతికి మద్దతు ప్రకటించిన ఆయన.. సీఎం కాగానే మాటతప్పి మడం తిప్పేశారు.

# ఢిల్లీ పర్యటనలో బిజీగా మంత్రి లోకేశ్

న్యూఢిల్లీ:రాష్ట్రంలో ఐటీ అభివృద్ధికి అండగా ఉండాలని కేంద్ర మంత్రులను కోరినట్టు ఏపీ ఐటీశాఖమంత్రి నారా లోకేశ్ తెలిపారు. దిల్లీలో పలువురు కేంద్రమంత్రులను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఏపీలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి కేంద్ర మంత్రులకు వివరించారు. వివిధ శాఖల మంత్రులతో ఆయా సమస్యలపై చర్చించా. విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు సాయం చేయాలనికోరు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రాజెక్టులపై రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ ఆరా తీశారు. కేంద్రం నుంచి రావాల్సిన బిల్లులు త్వరగా ఇవ్వాలని కోరా. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చిన కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు.. 20లక్షల ఉద్యోగాలు ఇస్తామనే హామీకి కట్టుబడి ఉన్నాం. రాష్ట్రంలో ఐటీ సేవలు, గ్రీన్ హైడ్రోజన్, రెన్యువబుల్ ఎనర్జీ విస్తరిస్తాం అని వివరించారు. ఇకపోతే కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో అభివృద్ధి కార్యాచరణలు, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన కార్యక్రమాలను రాజ్ నాథ్ సింగ్‌కి వివరించారు. డిఫెన్స్ రంగం పరికరాల తయారీలో పెద్ద ఎత్తున పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు వస్తున్న నేపథ్యంలో కొన్ని యూనిట్లు ఏపికి వచ్చేలా సహకరించాలని కోరారు. కేంద్రం అందించిన సహకారంతో రాష్ట్ర రాజధాని అమరావతి పనుల పురోగతి, పోలవరం



పనులు సాగుతున్న తీరును రాజ్ నాథ్‌కి తెలిపారు. ఈ భేటీకి కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని, శ్రీనివాస వర్మ, లావు శ్రీకృష్ణ దేవరాయలతో పాటు మరి కొందరు కేంద్ర మంత్రులు హాజరయ్యారు. ఈ భేటీలో మంత్రి లోకేష్, గత ప్రభుత్వాన్ని ఉద్దేశించి పలు అంశాలను కూడా ప్రస్తావించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా మార్చిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులను దశలవారీగా ముందుకు తీసుకువెళ్తుంద న్నారు. గత ప్రభుత్వ హైడ్రోజన్ విధానాల వల్ల రాష్ట్రం రూ. 10 లక్షల కోట్ల అప్పులలో చిక్కుకుపోయిందన్నారు. కానీ ఇప్పుడు కేంద్రం రాష్ట్రానికి ఆక్సిజన్ అందిస్తోందని లోకేష్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్రం సహకారాన్ని అందిస్తున్నందుకు మంత్రి లోకేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ఏపీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని మంత్రి రాజ్ నాథ్ సింగ్‌కు వివరించారు. ఈ భేటీ అనంతరం రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, రాష్ట్ర అభివృద్ధి కోసం అవసరమైన సహాయాన్ని ఇస్తామని లోకేష్‌కు హామీ ఇచ్చారు. మరోవైపు మంత్రి నారా లోకేష్ గూగుల్ క్లౌడ్ ఎండీ బిక్రమ్ సింగ్, కంట్రీ డైరెక్టర్ ఆశిష్‌తో విశాఖపట్నంలో గూగుల్ క్లౌడ్ ఏర్పాటుపై చర్చించేందుకు ఈరోజు ఉదయం ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో గూగుల్ క్లౌడ్ సంస్థ విశాఖపట్నంలో డేటా సిటీ ఏర్పాటుకు సంబంధించిన కీలక అంశాలు చర్చకు వచ్చాయి. మంత్రి లోకేష్ ప్రభుత్వం తరపున గూగుల్ క్లౌడ్‌కు అవసరమైన అనుమతులు, భూ కేటాయింపులు,
త్వరితగతిన నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీనికోసం
ఏపీ ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు ఇప్పటికే చురుగ్గా పనిచేస్తోందని చెప్పారు. ఈ క్రమంలో విశాఖపట్నంలో గూగుల్ క్లౌడ్ డేటా సిటీ ఏర్పాటుకు సంబంధించి, కంపెనీ తక్షణమే ప్రాజెక్టును వేగవంతంగా అమలు చేయాలని ఆయన కోరారు. ఈ ప్రాజెక్ట్ పూర్తైతే విశాఖపట్నం ఐటీ రంగంలో కొత్త దిశలో దూసుకెళ్తుందని, తద్వారా రాష్ట్రంలో ఆర్థిక అభివృద్ధికి దోహదపడతుందని లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. దేవాలయాల్లో ఇతర మతాచారాలు పాటించేవారిని తప్పించడం సాధారణమనని అన్నారు. రాష్ట్రాభివృద్ధిలో భాగంగా పలువురిని కలుస్తాం. ఫీడ్ బ్యాంక్ తీసుకునేందుకే ప్రశాంత్ కిశోర్‌ను కలిశా. ఐదేళ్ల వైకాపా పాలనలో విద్యావ్యవస్థ దారుణంగా దెబ్బతింది. వైకాపా పాలనలో
ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు తగ్గారు. ఐదేళ్లలో 45 లక్షల నుంచి 32 లక్షలకు పిల్లలు తగ్గిపోయారు' అని లోకేశ్ వివరించారు.

## న్యూఢిల్లీలో పగ్గాలు బిజెపికే



న్యూఢిల్లీ: న్యూఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిచడంతో ఆయా సంస్థలు తమ ఎగ్జిట్ పోల్స్ విడుదల చేశాయి. ఢిల్లీ ఓటరు.. బీజేపీకి పట్టం కట్టినట్లు దాదాపు అన్ని సర్వేల్లో స్పష్టమైనట్లు ఈ ఎగ్జిట్ పోల్స్ ద్వారా వెల్లడవుతోంది. అయితే కేకే సర్వే మాత్రం ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీలో మళ్లీ వరుసగా అధికారాన్ని చేపడుతోందంటూ తన సర్వేలో స్పష్టం చేసింది. కానీ చాణక్య స్ట్రాటజీస్, పీపుల్స్ పల్స్, రిపబ్లిక్ పి మార్క్ మాత్రం బీజేపీదే హస్తిన పీఠమని వెల్లడించింది. 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి ఒకే విడతలో పోలింగ్ జరిగింది. ఇప్పటి వరకు 58.20 మేర పోలింగ్ శాతం నమోదయింది. అలాగే పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు హక్కు వినియోగించుకొనే అవకాశాన్ని ఎన్నికల సంఘం అధికారులు కల్పించారు. పీపుల్స్ పల్స్–కొడిమో సంస్థల సంయుక్త ఎగ్జిట్‌పోల్ సర్వే ప్రకారం.. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో బీజేపీ జెండా ఎగరనుందని స్పష్టం చేసింది. ఈ సర్వేలో బీజేపీ 51–60, ఆప్ 10–19, కాంగ్రెస్‌తోపాటు ఇతరులకు చోటు దక్కదని స్పష్టం చేసింది. అయితే ఢిల్లీలోని మహిళా ఓటర్లు మాత్రం ఆమ్ ఆద్మీ పార్టీకి జైకొట్టినట్లు పీపుల్స్ పల్స్ కొడిమో వెల్లడించింది. చాణక్య స్ట్రాటజీస్: బీజేపీ 39 నుంచి 44 స్థానాలు, ఆప్ 25 నుంచి 28 స్థానాలు, కాంగ్రెస్ పార్టీ 2 నుంచి 3 స్థానాలు, పీపుల్స్ పల్స్: బీజేపీ 51 నుంచి 60, ఆప్ 10 నుంచి 19 స్థానాలు, కేకే సర్వేలో మాత్రం ఆప్ 39, బీజేపీ 22, రిపబ్లిక్ పిమార్క్: బీజేపీ 39 నుంచి 49, ఆప్ 21 నుంచి 31, కాంగ్రెస్ పార్టీ 1స్థానం గెలుస్తాయని వెల్లడించింది. సర్వే ప్రకారం పోటీ ఆప్, బిజెపిల మధ్యే సాగింది. కాంగ్రెస్ ఎక్కడా గట్టి పోటీ ఇవ్వలేదని తేలిపోయింది.

## దేశరాజధాని ఢిల్లీలో ఓట్ల పండుగ

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో నేడు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య పండుగలో ప్రజలు పాల్గొనాలని ప్రధాని మోడీ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాలకు ఒకేరోజు బుధవారం ఓటింగ్ జరుగుతోంది. ఈ ప్రజాస్వామ్య పండుగలో ఉత్సాహంతో పాల్గొని తమ విలువైన ఓటును వేయాలని నేను ఓటర్లను కోరుతున్నాను. ఈ ఎన్నికల్లో తొలిసారి ఓటు వేయనున్న యువతీయువకులకు శుభాకాంక్షలు. ఫస్ట్ ఓట్ దెన్ రిఫ్రెష్‌మెంట్' అని మోడీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.
ఒకే విడతలో జరగనున్న 70 శాసనసభ స్థానాలకు సాయంత్రం ఆరు వరకూ ఓటింగ్ జరగనుంది.ఈ ప్రజాస్వామ్య పండుగలో అందరూ భాగస్వాములు కావాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం ఆమ్ ఆద్మీ పార్టీని లక్ష్యంగా చేసుకున్నారు. ఓ పక్క స్వచ్ఛమైన రాజకీయాల గురించి మాట్లాడుతూ అతిపెద్ద కుంభకోణం ఎవరు చేశారో ఓటు వేసేటప్పుడు ఢిల్లీ ప్రజలు గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు. తమ పార్టీకి ఓటు వేయడం ద్వారా ప్రజల హక్కులు తిరిగి పొందుతారని, రాజ్యాంగం బలోపేతం అయ్యి ఢిల్లీ మళ్లీ ప్రగతి పథంలో పయనిస్తుందని
రాహుల్ అన్నారు. న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలోని నిర్మాణ్ భవన్ పోలింగ్ కేంద్రంలో ఉదయం కాంగ్రెస్ నాయకుడు ఓటు వేశారు. 'నా ప్రియమైన ఢిల్లీ సోదర సోదరీమణులారా' అని సంబోధిస్తూ రాహుల్ గాంధీ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఢిల్లీ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. 'మీరందరూ ఈరోజే వెళ్లి ఓటు వేయమని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. కాంగ్రెస్‌కు వేసే ప్రతి ఓటు మీ హక్కులను కాపాడుతుంది. రాజ్యాంగాన్ని బలోపేతం చేసి ఢిల్లీని తిరిగి పురోగతి మార్గంలో నడిపిస్తుంది. ఓటు వేసేటప్పుడు, కలుషితమైన గాలి, మురికి నీరు, చెడిపోయిన రోడ్లకు ఎవరు బాధ్యులో గుర్తుంచుకోండి. స్వచ్ఛమైన రాజకీయాలు చేయడం గురించి మాట్లాడుకుంటూ ఢిల్లీలో అతిపెద్ద కుంభకోణానికి పాల్పడింది ఎవరు? అనేది గుర్తుంచుకోండి' అని తెలిపారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు 13,766 పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ పోలింగ్ ప్రశాంతంగా ప్రారంభం అయ్యింది. 70 నియోజకవర్గాల్లో వివిధ పార్టీల 699 మంది అభ్యర్థుల పోటీపడుతున్నారు. ఈ నేతల భవితవ్యాన్ని ఢిల్లీ ఓటర్లు తేల్చనున్నారు. అధికార ఆమ్ ఆద్మీ పార్టీ హ్యాట్రిక్ కొట్టాలని ఉవ్విళ్లూరుతోంది. పాలనా రికార్డు, సంక్షేమ పథకాలే ఆధారంగా వరుసగా మూడవసారి అధికారంలోకి రావాలని ఆశిస్తోంది.

## ప్రజలపై భారం వేయలేమన్న బాబు నిర్ణయం సమర్థనీయం


**విజయవాడ:** 'ప్రపంచం మారుతుంది–చంద్రబాబు కూడా మారాలని, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ప్రజలు చాలా ఇబ్బందుల్లో ఉన్నారనీ, వారిపై ఎలాంటి భారాలను వేయలేమని ఏపీ సీఎం చంద్రబాబు చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని వాడుకున్న జాతీయ, అంతర్జాతీయ కంపెనీలపై ట్యాక్సులను వేయాలని డిమాండ్ చేశారు. అప్పుడు రాష్ట్రానికి బోలెడంత ఆదాయం వస్తుందన్నారు. ప్రభుత్వ రంగాన్ని బలపరుచుకోవాలన్నారు. బుధవారం ఉదయం విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ..పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు ముందుగా వచ్చిన ఆర్థిక సర్వే .. ప్రజల ఆర్థిక శక్తి పడిపోతుందని, ప్రజలిక భారాలను భరించగలిగే స్థితిలో లేరని తెలిపిందన్నారు. ప్రజలు అప్పుల్లో ఉన్నారని, వారిక భారాలను భరించలేరన్న విషయాన్ని పార్లమెంటులో బ్జడెట్‌ను ప్రవేశపెట్టక ముందే చంద్రబాబు గుర్తించి ఉంటే బాగుండేదన్నారు. ప్రస్తుతం భారతదేశంలో పెట్టుబడులన్నీ వెనక్కు వెళ్లిపోతున్నాయన్నారు. షేరు మార్కెట్లు తగ్గిపోతున్నాయని అన్నారు. అంతర్జాతీయ ఆర్థిక మాంద్యపు ప్రభావం నేడు భారతదేశంపై పడుతుందన్నారు. భారతదేశం అంతర్జాతీయ మార్కెట్‌లోకి వెళ్లి బ్రహ్మాండమైన అభివృద్ధిని సాధిస్తుందని, 8 శాతం అభివృద్ధి సాధిస్తామని మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన మాటలన్నీ భోగస్సేనన్నారు. కేవలం కార్పొరేట్ శక్తులకు బలాన్నివ్వడం కోసం చెబుతున్న మాటలే తప్ప ఎలాంటి వాస్తవం లేదన్న విషయాన్ని ఆర్థిక సర్వే తేటతెల్లం చేసిందని వివరించారు. ఇప్పుడు ప్రజలపై ఇక అదనపు భారాలు వేయలేమని చంద్రబాబు చెప్పారని, అయితే ప్రజలు అప్పుల భారాల్లో ఉన్నారని, అదనపు భారాలను భరించలేరని వామపక్షాలు ముందుగానే గత నవంబర్ నెలలోనే చెప్పినట్లు శ్రీనివాసరావు గుర్తు చేశారు. కానీ ఆ రోజుల్లో చంద్రబాబు మాట్లాడుతూ ? మామూలు స్టేట్ రోడ్లకు కూడా ట్యాక్స్ వేయాలని అన్నారని గుర్తు చేశారు. ఖజానా ఖాళీగా ఉందని, ఒక శాతం జిఎస్‌టి పెంచుతామని వీటన్నిటిపై సెంట్రల్‌కు ప్రతిపాదన కూడా వారు పంపారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఖజానానే ఖాళీగా ఉన్నప్పుడు? ప్రజల ఖజానా ఏమైనా నిండుగా ఉందా ? అని ప్రశ్నించారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు పెంచుతున్నారని, చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రజలపై భారం మోపారని విమర్శించారు. గతంలో ఎన్నడూ ఇలా వరుసగా 3 సార్లు జనాలపై ఇలా ట్రూఅప్ ఛార్జీలను వేయలేదని చెప్పారు. ప్రజలు అప్పుల్లో ఉన్నారని, ట్రూ అప్ ఛార్జీలను ప్రజలు భరించలేరని గతంలోనే వామపక్షాలు స్పష్టం చేశాయన్న సంగతిని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వాస్తవాన్ని గుర్తించి ప్రజలపై భారాలు వేయలేము అని చెప్పడాన్ని తాము స్వాగతిస్తున్నామ న్నారు. ప్రభుత్వ ఆస్తులమ్మి ఖజానాను నింపుకుంటామంటే దాన్ని ఏమాత్రం సమ్మతించబోమని స్పష్టం చేశారు. రాష్ట్రానికి కేంద్రం నుండి రావల్సిన వనరులున్నాయని, రూ.20 వేల కోట్లు ఇప్పటికే కేంద్రం ఏపీ రాష్ట్రానికి బకాయి ఉందని తెలిపారు. పోలవరానికి కేంద్రం కేవలం డ్యాం కట్టడానికి నిధులిస్తుంది కానీ పునరావాసానికి ఇవ్వడం లేదని చెప్పారు. 2013 చట్టం ప్రకారం ? పునరావాసానికి ఇవ్వాల్సిన నిధులను ఇవ్వకుండా చేస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్లకు నిధులను రెన్యువల్ చేస్తున్నారు కానీ పునరావాసానికి మాత్రం పదేళ్ళనాటి పద్ధతినే అనుసరించడం న్యాయం కాదన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికీ పునరావాసాన్ని అప్‌డేట్ చేసి రూ.10 లక్షలకు తగ్గకుండా ఇవ్వాలని, వారికి ఇండ్లు, ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు, ఆదివాసీలకు ఇవ్వాల్సిన పూర్తిస్థాయి భద్రతను ఇస్తేనే పోలవరం
పూర్తవుతుందని, పునరావాసం పూర్తవుతుందని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కేంద్రం నుండి రావల్సిన రెవెన్యూ లోటు భర్తీ, కడప ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు, చట్ట ప్రకారం రాష్ట్రానికి రావల్సిన ప్యాకేజీలను, ప్రత్యేక హోదాను సాధించాలని కోరారు. రాష్ట్రంలో కడప ఉక్కు ఫ్యాక్టరీని బలపరిస్తే ప్రజలకు ఉపాధి దొరుకుతుందని, కొనుగోలు శక్తి పెరుగుతుందని, అప్పుల నుండి కోలుకుంటారని అన్నారు. డీఎస్సీ సీట్లు భర్తీ చేయాలన్నారు. ప్రజలపై అదనపు భారాలను వేయబోమని చెప్పడమే కాదు కానీ ప్రజల ఆదాయ మార్గాలను పెంచే చర్యలను ప్రభుత్వం చేపట్టాలని శ్రీనివాసరావు కోరారు. కేంద్రంతో పోరాడి రాష్ట్రానికి రావల్సిన నిధులన్నిటినీ తీసుకురావాలని ఆశించారు.

## తప్పుల తడకగా బిసి కులగణన సర్వే

### సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ ఎంపి లక్ష్మణ్

హైదరాబాద్:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కులగణనపై ప్రవేశపెట్టిన నివేదిక తప్పుల తడకగా ఉందని.. పూర్తిగా వాస్తవ విరుద్ధంగా ఉందంటూ బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. సామాజిక న్యాయం పట్ల రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉండి ఉంటే బిల్లు తీసుకొని వచ్చేవారన్నారు. ఓబీసీలపై వలకబోస్తున్న ప్రేమ బయట పడిందని విమర్శించారు. బీసీల లెక్కలను తగ్గించి చూపించారని మండిపడ్డారు. బీసీలను రాజకీయంగా అణిచివేయాలని చూస్తోందని ఆరోపించారు. హిందూ బీసీలు, ముస్లిం బీసీలు అని పెట్టారని తెలిపారు. బీఆర్ఎస్ చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో 52 శాతం బీసీలు అని అప్పుడు కేసీఆర్ చెప్పారని.. ఇప్పుడు బీసీలను 42 శాతానికి తగ్గించారన్నారు. లేస్తే రాహుల్ గాంధీ రాజ్యాంగం పుస్తకం పట్టుకుని తిరుగుతారని.. కనీసం అవగాహన ఉండాలన్నారు. 10 శాతం ముస్లిం బీసీలు, 36 శాతం హిందూ బీసీలు అని పెట్టారని.. ఇది ఒక భారీ కుట్ర అంటూ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటే అని.. ముస్లిం మన్నన పొందడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ముస్లిం బీసీలు, హిందూ బీసీలు అంటూ రాజ్యాంగ విరుద్ధమైన అంశాన్ని చేర్చారన్నారు. బీఆర్ఎస్ అంబేద్కర్ మతపరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకమన్నారు. రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకొని తిరగడం కాదని..చదివితే రాజ్యాంగంలో ఏం ఉందో తెలుస్తుందని వ్యాఖ్యలు చేశారు.

## హైబ్రీడ్ అన్యూటీ మోడ్ రోడ్ల నిర్మాణంలో వేగం పెంచాలి



**హైదరాబాద్:**రాష్ట్రంలో హైబ్రీడ్ అన్యూటీ మోడ్ రోడ్ల నిర్మాణంలో వేగం పెంచాలని రోడ్లు భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నియమ, నిబంధనలకు అనుగుణంగా హ్యామ్ రోడ్ల నిర్మాణం చేయాలని అధికారులకు సూచించారు. సచివాలయంలో హ్యామ్ రోడ్లపై ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షించారు. మండలం నుంచి జిల్లా కేంద్రానికి మిస్సింగ్ లింక్ రోడ్లు, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధానికి మిస్సింగ్ లింక్ రోడ్ల, అప్ గ్రేడేషన్ వంటి మూడు విభాగాలుగా నిర్మాణం చేపట్టాలన్నారు. హ్యామ్ రోడ్ల నిర్మాణంలో కన్సల్టెంట్లను గుర్తించి, డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. మంచిగా ఉన్న రోడ్లను హ్యామ్ లోకి తీసుకువస్తే కన్సల్టెంట్లే బాగుపడుతరు కాబట్టి, అధికారులు హ్యామ్ రోడ్లను గుర్తించే క్రమంలో.. అత్యంత దారుణంగా ఉండి, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న రోడ్లకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు.
రోడ్ల నిర్మాణంలో డివైడర్లు, లైంటింగ్, రోడ్డు విస్తరణ, పేవ్ డ్ షోల్డర్స్ ఏర్పాటులో ప్రభుత్వ గైడ్ లైన్స్ పాటించేలా పకడ్బందీగా వ్యవహరించాలని మంత్రి తేల్చిచెప్పారు. 15 ఏండ్ల పాటు హ్యామ్ రోడ్డు తీసుకున్న సంస్థే పూర్తిగా మెయింటినెన్స్ చేయాల్సి ఉన్నందున రోడ్డు నాణ్యతలో రాజీపడకుండా ఉండేలే ప్రతీ ఇంజనీర్ జాగ్రత్తగా పనులను తనిఖీ చేయాలని సూచించారు. ఇప్పటి వరకు మట్టి రోడ్డుగా ఉన్న రోడ్లను గుర్తిస్తే.. తన దృష్టికి తీసుకువస్తే వెంటనే మంజూరీ చేస్తానని అధికారులకు తెలిపారు. అటవీ అనుమతులతో మట్టిరోడ్లుగా ఉన్న రహదారులను భవిష్యత్తులో బీటీగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజాధనంతో నిర్మిస్తున్న రహదారుల నిర్మాణంలో ఎక్కడా రాజీలేదని.. నాణ్యతలేని పనులు చేస్తే వెంటనే పనులను రద్దు చేస్తామని కోమటిరెడ్డి హెచ్చరించారు. హ్యామ్ రోడ్ల నిర్మాణాలకు సమయం కావాలని అడిగిన కన్సల్టెంట్ల అభిప్రాయాలను తోసిపుచ్చారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. సంవత్సరం సమయం తీసుకుంటే ప్రమాదాల్లో చనిపోతే ఏవరు బాధ్యత వహిస్తారని మంత్రి నిలదీసారు. ఏ రోడ్డు నిర్మాణమైన రెండు, మూడు నెలల్లో ప్రారంభించేలా వేగంగా ముందుకు వెళ్లాలని ఆదేశించారు.

# విద్యా వ్యవస్థలో "మార్పు కోసం పోరాటం".

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఫిబ్రవరి 5**



**ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంకు నిరంతరం కృషి.**
**మోడీ నాయకత్వంలో నే మంచి పాలన.**
**ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య వెల్లడి.**
**ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ సమీక్షా సమావేశం.**
**పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్.**

విద్యా వ్యవస్థలో సమూల "మార్పు కోసం పోరాటం" చేస్తానని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య హామి ఇచ్చారు. నగరంలోని ప్రైవేట్ హొటల్ లో బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరయ్య మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోకుండా తీవ్ర అన్యాయం చేశాయని అన్నారు. సమయానికి వేతనం ఇవ్వకుండా ఇబ్బందులు సైతం పెట్టారన్నారు. మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో దేశంలోనే మంచి మార్పు తీసుకొస్తున్నారని తెలిపారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యా సంస్థల బకాయిల విడుదలతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తామని అన్నారు.

**వివాదరహితుడు మల్క కొమురయ్య: అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్.**

అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్న మల్క కొమురయ్య విద్యావేత్త, వివాదరహితుడని, 40 ఏళ్లుగా విద్యావ్యవస్థలో చాలా అనుభవం ఉన్న గొప్ప వ్యక్తి అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే పరిస్థితి లేదన్నారు. ప్రజలను, ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందని అన్నారు. అసెంబ్లీ సమావేశంలో కూడా బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.
అందువల్ల ప్రభుత్వం పై పోరాడే వ్యక్తిని ఎమ్మెల్సీ గా ఎన్నుకోవాల్సి అవసరం ఉందని అన్నారు. తెలంగాణలో బిజెపి ప్రత్యమ్నాయ [illegible] భవిష్యత్తులో కచ్చితంగా ప్రజలకు సేవలు అందిస్తుందని అన్నారు. కార్యకర్తలు కష్టపడి రెండు ఎమ్మెల్సీ స్థానాలను బిజెపికే వచ్చేలా కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, నాయకులు పల్లే గంగారెడ్డి, లింగారెడ్డి, టక్కర్ హన్మంత్ రెడ్డి, లక్ష్మీనారాయణ, స్రవంతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలి.

**- బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి అంజి రెడ్డి.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఫిబ్రవరి 5:**



ప్రజా వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని పట్టభద్రుల ఎమ్మెల్సీ బిజెపి అభ్యర్థి అంజి రెడ్డి అన్నారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలపై ఉద్యమిస్తామని పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపి నిర్వహించిన సమీక్షా సమావేశం లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలు అని చెప్పి, అధికారంలోకి వచ్చి అన్ని వర్గాలను మోసం చేసిందని అన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులకు తీరని అన్యాయం చేసిందన్నారు. ప్రైవేట్ కళాశాలలకు ఫీజు రీయంబర్స్మెంట్ ఇవ్వక పోవడం వల్ల, యాజమాన్యాలతో పాటు విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలి.

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, ఫిబ్రవరి 5:**




సిడిపిఓ లు, సూపర్వైజర్లు క్షేత్ర పర్యటనలో అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంగన్వాడీ భవన నిర్మాణాలు, విద్యుత్ సరఫరా, త్రాగునీరు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీడీపీఓ లు, సూపర్వైజర్లు నెలలో కనీసం 20 అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని, కేంద్రాల్లో పారిశుధ్యం, నీటి సరఫరా, పౌష్టికాహారం, బాలామృతం, బియ్యం తదితర సరుకుల స్టాకు రిజిస్టర్ లను పరిశీలించాలని, కేంద్రాలకు వచ్చే పిల్లల హాజరు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. కొత్తగా నిర్మించే అంగన్వాడీ భవనాలు నిర్మాణాలు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను జిల్లా సంక్షేమ అధికారిని పరిశీలించాలని సూచించారు. శిధిలావస్థలో ఉన్న భవనాల్లో కేంద్రాలను నడుపకూడదని తెలిపారు. జిల్లాలో అంగన్వాడీ లకు స్వంత భవనాలు ఉండి విద్యుత్ సరఫరా లేని వాటికి విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని, అవసరమున్న కేంద్రాలకు విద్యుత్ సరఫరాకు మీటర్ లను సరఫరా చేయాలనీ విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్ ను ఆదేశించారు. విద్యుత్ శాఖ ఏఈఈ, సూపర్వైజర్ జాయింట్ తనిఖీ చేసి విద్యుత్ సరఫరా కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు త్రాగునీటి సరఫరాకు మిషన్ భగీరథ కనెక్షన్ ఇవ్వాలని తెలిపారు. వచ్చే వేసవి లోగా అన్ని కేంద్రాలకు నీటీ సరఫరా అయ్యే విధంగా చూడాలని మిషన్ భగీరథ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సామ్ మామ్ పిల్లలపై శ్రద్ధ కనబరచాలని తెలిపారు. రిపోర్టింగ్ సరిగా నమోదు చేయాలనీ తెలిపారు.
సూపర్వైజర్స్ పనితీరును, పర్యటనలను సిడీపీఓ లు పర్యవేక్షించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు పోషకాహారం
సరఫరా లను తనిఖీ చేయాలని తెలిపారు. కేంద్రాలకు వచ్చే పిల్లల సంఖ్య ఎక్కువ గా నమోదు చేయడం , పిల్లల హాజరు తక్కువగా ఉండడం గమనించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ ల పనితీరును మెరుగుపరచి పిల్లలు, బాలింతలు, గర్భిణీలు సంఖ్య పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని ఏ.ప్రమీల, టాస్క్ ఎస్ఈ శ్రావణ్ కుమార్, పంచాయతీ రాజ్ శాఖ ఈఈ లు దుర్గా ప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ రమేష్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, సిడీపీఓ లు, సూపర్వైజర్స్, తదితరులు పాల్గొన్నారు.

# జై తరుణ్, సునీత లను టీయు వీసీ అభినందన.




ఢిల్లీలోని గణతంత్ర దినోత్సవ పరేడ్ లో పాల్గొన్న విద్యార్థులు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఫిబ్రవరి 5:**

దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించబడిన గణతంత్ర దినోత్సవ పరేడ్ లో పాల్గొన్న తెలంగాణ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ విభాగానికి చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్ జై.తరుణ్, తెలంగాణ కాంటింజెంట్ లీడర్ డాక్టర్ ఎం సునీత ను విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సర్ ఆచార్య టి యాదగిరి రావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం యాదగిరి బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సర్ మాట్లాడుతూ, దేశ అత్యున్నత స్థాయి కార్యక్రమంలో పాల్గొనడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య రవీందర్ రెడ్డి. తెలంగాణ వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ స్వప్న జూనియర్ అసిస్టెంట్ సురేష్ పాల్గొన్నారు.

# సుప్రీం తీర్పుపైనే బిఆర్ఎస్ ఆశలు !

పార్టీలు మారడం తప్పే...ఒకపార్టీ నుంచి గెలిచిన వారు మరో పార్టీలోకి మారడం అన్నది సర్వసాధారణం అయ్యింది. రాజ్యాంగం ప్రకారం కఠిన నిబంధనలు లేకపోవడంతో జంపింగ్ జిలానీలు ఉండనే ఉంటున్నారు. అధికారంలో ఉన్న పార్టీకి సహజంగానే దుంకేస్తున్నారు. ఇంతకాలంగా ఇది నడుస్తూనే ఉంది. తాజాగా తెలంగాణలో పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో లొల్లి మొదలయ్యింది. దీనిపై బిఆర్ఎస్ పోరాడుతూనే ఉంది. చివరకు సుప్రీంలో కేసు వేసింది. ఇంతకాలం ఎందుకు చర్య తీసుకో లేదని తాజాగా సుప్రీం ప్రశ్నించడంతో తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి ఆ పదిమందికి నోటీసులు ఇచ్చారు. లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలన్నారు. ఇదంతా ఒక ఎత్తయితే గతంలో ఎమ్మెల్యేను గంపగుత్తగా పార్టీలో చేర్చుకుని కాంగ్రెస్, టిడిపి, సిపిఐలను దెబ్బకొట్టిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీది. తెలంగాణ పునరేకీకరణ పేరుతో నిస్సిగ్గుగా ఎమ్మెల్యేలను గోడదాటించారు. ఆనాడు వారి చేసివుండకపోయి వుంటే..ఇవాళ బిఆర్ఎస్ వాదనకు బలం ఉండేది. నిజాయితీ ఉండేది. కానీ తొమ్మిదన్నరేళ్ల పాలనలో చేయని అరాచకం లేదు. తెలంగాణ రావడం ఆ కుటుంబం కోసమే అన్నట్లుగా పాలన సాగించారు. ఇష్టం వచ్చినట్లుగా అప్పులు చేసి, అభివృద్ధి ముసుగేశారు. దాదాపు 7 లక్షల కోట్లు అప్పులుచేసిన పెద్దాయన ఇప్పుడు అసెంబ్లీ మొహం చూడడం లేదు. ఫామ్‌హౌజ్ వీడి బయటకు రావడం లేదు. కేవలం ఆయన కొడుకు, కూతురు, అల్లుడు మాత్రమే రాజకీయాలు నడుపుతున్నారు. అసెంబ్లీలో కూడా అబద్దాలు చెప్పడం అలవాటు చేసుకున్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనపై దుమ్మెత్తి పోస్తున్నారు. ఉప ఎన్నికలకు సిద్దంగా ఉండండి అంటూ కెటిఆర్ పార్టీ శ్రేణులకు లీకులు ఇస్తున్నారు. తెలంగాణలో అధికారం కోల్పోయిన బిఆర్ఎస్, తరవాత పార్లమెంట్ ఎన్నికల్లో పూర్తిగా చతికిల పడ్డది. విజయం సాధించక పోవడంతో పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. పదిమంది పోయారనని సరిపెట్టుకోవడానికి కూడా లేదు. గతంలో టిఆర్ఎస్ ఆడిన విధంగానే కాంగ్రెస్ కూడగా పాచికలు వేస్తోంది. బిఆర్ఎస్‌ను బొందపెట్టడమే లక్ష్యంగా కాంగ్రెస్, బిజెపిలు పావులు కదుపుతున్నాయి. ఎందుకంటే ఇప్పటికే అనేకమంది బిఆర్ఎస్‌ను వీడి అధికార కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఎమ్మెల్యేలు జారుకుంటున్నారు. అధికారంలో లేకున్నా ఎపిలో విపక్షంగా టిడిపి ఉన్నా బలంగా నిలబడి తిరిగి అధికారం దక్కించుకుంది. అక్కడ జగన్ ఎన్ని విధాలుగా వేధించినా నేతలు, కార్యకర్తలు టిడిపిని వీడలేదు. కానీ బిఆర్ఎస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం లేదు. ఒక కటుఉంబం చేతిలో పార్టీ ఉండిపోయింది. పదేళ్లు అధికారంలో ఉన్నా కుటుంబ పాలన వల్ల బిఆర్ఎస్ అధికారం కోల్పోయింది. అనేక అక్రమాలను మూటకట్టుకుంది. అవే ఇప్పుడు యమపాశాలై వెన్నాడుతున్నాయి. ఓటమి తరవాత ఇక్కడ బిఆర్ఎస్, ఎపిలో వైసిపి ఒకే తరహా డ్రామాలు ఆడుతున్నాయి. ఎమ్మెల్యేలను లేదా ఎంపిలను లేదా క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను చేర్చుకోవడంలో తెలంగాణలో పోటీ కేవలం కాంగ్రెస్, బిజెపిల మధ్యనే ఉంది. ఈ రెండు పార్టీలు ఆధిపత్యం లక్ష్యంగా పెట్టుకుని పోరాడుతున్నాయి. దీంతో విపక్ష బిఆర్ఎస్‌లో చేరేందుకు ఎవరు కూడా ముందుకు రావడం లేదు. పదేళ్లు అధికారంలో ఉన్న పార్టీ ఇంతగా ప్రజల్లో ఆదరణ కోల్పోవడం కేవలం బిఆర్ఎస్‌లో మాత్రమే కనిపిస్తోంది. ఈ క్రమంలో వచ్చే స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ అత్యధిక సర్పంచ్ సీట్లు గెలిస్తేనే రాజకీయంగా నిలుస్తుంది. అందుకే మైండ్ గేమ్ ఆడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా బీఆర్ఎస్ చతికిల బడటం, కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగు తున్న విచారణ, ఎమ్మెల్సీ కవిత మద్యం కుంభకోణంలో జైలుకు వెళ్లడం, ముఖ్యనేతలు అనుకున్న వారంతా కారు దిగి హస్తం పార్టీలోకో, బీజేపీ గూటికో చేరడం వంటి పరిణామాలతో గులాబీ పార్టీ ఉక్కిరి
బిక్కిరి అవుతోంది. దీంతో పార్టీ క్యాడర్లో జోష్ నింపేందుకు కేటిఆర్ నిత్యం ఏదో ఒక విధంగా అబద్దాల ప్రచారం అందుకున్నారు. తమ పదేళ్లలో చేయలేని పనులను ఇప్పుడు ప్రస్తావిస్తున్నారు. తమ దోపిడీ రాజ్యాన్ని ప్రజలు మరచి పోయేందుకు డ్రామాలు ఆడుతున్నారు. ఈ క్రమంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయించేందుకు సుప్రీంలో కేసు వేసి పోరాడుతున్నారు. పార్టీ మారడం నైతికంగా తప్పే. సుప్రీం దీనిని గుర్తించి తీర్పును ఇస్తే వచ్చే తరాలకు ఇది..ఓ గుణపాఠం కానుంది. ఇదంతా రానున్న వారం రోజుల్లో తేలుతుందా అన్నది చూడాలి. ఇకపోతే అసెంబ్లీ సమావేశాలకు ఇక్కడ కెసిఆర్, అక్కడ జగన్ హాజరు కావడం లేదు. ఇలా హాజరుకాని వారిని ఎమ్మెల్యేలుగా ఎందుకు పరిగణించాలో కూడా చట్టంలో చెప్పలేదు. అందువల్ల దీనిపైనా చర్చ చేయాల్సి ఉంది. అసెంబ్లీకి ఎందుకురారో చెప్పడం లేదు. కెసిఆర్, జగన్ అసెంబ్లీ సమావేశాల్లో కీలకంగా వ్యవహరిస్తారని అంతా అనుకున్నారు. కానీ అలాంటిదేమీ జరగలేదు. అసెంబ్లీ ద్వారా ప్రజల్లో ఉండేందుకు వచ్చిన అవకాశాన్ని వదులుకున్నారు. త్వరలోనే పెద్ద బహిరంగ సభ పెట్టి కాంగ్రెస్‌ను కడిగి పారేస్తానని అంటున్నారు. అయితే ఇప్పటికిప్పుడు బిఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. గులాబీ పార్టీని నిలుపుకునేందుకు మాజీ సీఎం ఆ పార్టీ అధినేత కేసీఆర్ రంగంలోకి దిగుతారని అనుకుంటున్నారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుందని బిజపి, బిఆర్ఎస్‌లు ప్రచారం చేస్తున్నా అది పెద్దగా ప్రజలు పట్టించుకునే స్థాయిలో లేదు. స్థానిక ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ పార్టీ ఉనికి కోల్పోతుందని కాంగ్రెస్ జోస్యం చెబుతోంది. బీఆర్ఎస్ దుకాణం బంద్ అవుతుందని, దాదాపు 25 మంది ఎమ్మెల్యేలు కారు దిగడం ఖాయమని ప్రచారం సాగుతోంది. బీఆర్ఎస్ లో నలుగురు మాత్రమే ఉంటారని, మిగతా వారంతా బయటకు రావడం ఖాయమని గులాబీ నేతలను మానసికంగా కృంగదీసేలా మంత్రులు తమ వ్యాఖ్యలు ముమ్మరం చేస్తున్నారు. అయితే స్థానిక ఎన్నికల్లో బలాబలాలు ఎలా ఉంటాయన్నది చూడాలి. అలాగే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై సుప్రీం తీర్పు ఎలా ఉంటుందో చూడాలి.

# బిసి జనాభా లెక్కలపైసమగ్ర సమాచారం ఇవ్వాలి.

**- బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు -దండి వెంకట్.**

**వేగుచుక్క న్యూస్, హైదారాబాద్:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల గనణ లో బిసి కులాల జనాభా లెక్కలను కులాల వారిగా సమగ్ర వివరాలతో కూడిన సమాచారాన్ని ప్రజల ముందు ఉంచాలని బహుజన లెఫ్ట్ పార్టీ(బహుజన కమ్యూనిస్టు) బిఎల్పీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బిసి కులాల సంఘాల నాయకులు, ప్రతిపక్ష పార్టీలు బిసి కులాల జనాభా లెక్కల వివరాలపై అనుమానాలు వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో
బిసి కులాల మేధావులు, బిసి ప్రజా ప్రతినిధులతోపాటు అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి అనుమానాలపై నివృత్తి చేయాలని అన్నారు. ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమగ్ర కుల గనణ సర్వే వివరాలపై సమగ్ర చర్చకంటే బీఆర్ఎస్, బిజెపి తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యతనుఇచ్చాయని విమర్శించారు.
ఎస్సీ వర్గీకరణ గెజిటెడ్ విడుదల చేసేముందు మాదిగ, మాల వాటి ఉప కులాల మేధావులతో ప్రభుత్వం చర్చించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాల వర్గీకరణ పోరాటానికి ఇకనైనా సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేసి దేశానికి ఆదర్శంగా నిలవాలని కోరారు.



# బాల్టిమోర్ ప్రమాదంతో అమెరికాలో ఆర్థిక విపత్తు!



అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రం బాల్టిమోర్‌లో మంగళవారం జరిగిన ఘోర నౌక ప్రమాదం ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయింది. పటాప్‌స్కో నదిపై ఉన్న ఫ్రాన్సిస్ స్కాట్ కీ బ్రిడ్జిని ఆ నదిలో నుంచి వెళ్తున్న ఓ షిప్ ఢీకొట్టింది. దీంతో ఆ వంతెన కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో ఆరుగురు చనిపోయారు. సింగపూర్ జెండాతో బాల్టిమోర్ నుంచి శ్రీలంక రాజధాని కొలంబోకు వెళ్తున్న ఆ షిప్.. ఫ్రాన్సిస్ స్కాట్ కీ బ్రిడ్జి పిల్లర్‌ను బలంగా ఢీకొట్టడంతో ఈ ఘటన చోటు చేసుకుంది.
గతవారం జరిగిన బాల్టిమోర్ వంతెన ప్రమాదంతో స్థానిక నౌకాశ్రయంలో కార్యకలాపాలు నిలిచిపోయినట్టు మేరీల్యాండ్ గవర్నర్ వెస్ మూర్ వెల్లడించారు. ఈ పరిణామాలు కేవలం బాల్టిమోర్, మేరీల్యాండ్‌లకే పరిమితం కాదని అమెరికా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఈ ఘటనను 'జాతీయ ఆర్థిక విపత్తు'గా అభివర్ణించారు. గతవారం బాల్టిమోర్ లోని పటాప్‌స్కా నదిపై ఫ్రాన్సిస్ స్కాట్ కీ వంతెనను నౌక ఢీకొట్టి కూలిపోయిన విషయం తెలిసిందే. దీంతో అమెరికాలో అత్యంత రద్దీగా ఉండే పోర్టుల్లో ఒకటైన బాల్టిమోర్‌లో కార్యకలా పాలు నిలిచిపోయాయి. 'అమెరికాలో అత్యంత రద్దీగా ఉండే ఓడరేవుల్లో బాల్టిమోర్ ఒకటి.. గతేడాది ఈ పోర్టు నుంచి 11 లక్షల కంటెయి నర్లు వెళ్లాయి.. కార్లు, ట్రక్కులు, వ్యవసాయ పరికరాల ఎగుమతులకు దేశవ్యాప్తంగా ఇదే అతిపెద్ద ఓడరేవు.. వంతెన కూలి ప్రస్తుతం కార్యాకలాపాలు నిలిచిపోవడంతో.. దీని ప్రభావం కేవలం మేరీల్యాండ్‌కే పరిమితం కాదు. కెంటకీలో రైతులు, ఒహియోలో ఆటో డీలర్లు, టెనెస్సీలో రెస్టారెంట్‌లపైనా కూడా ప్రభావం పడుతుంది.. ఈ నౌకాశ్రయం దేశ ఆర్థికాభివృద్ధిలో కీలకం. అందుకే వీలైనంత త్వరగా రాకపోకలు పునరుద్ధరించడం అవసరం... బాల్టిమోర్ నౌకాశ్రయం మా ఆర్థికవృద్ధికి దోహదపడుతుం ది.. అమెరికా ఆర్థిక వ్యవస్థ మళ్లీ ముందుకెళ్లేం దుకు సత్వర చర్యలు తీసుకున్నామని నిర్ధరిం చుకోవాలి' అని వెస్ మూర్ పేర్కొన్నారు. మరోవైపు, బ్రిడ్జి శకలాలను తొలగించేందుకు అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. వెయ్యి టన్నుల బరువులను ఎత్తగల భారీ క్రేన్‌ను రప్పించినట్లు మూర్ తెలిపారు. వంతెనను ఢీకొట్టిన నౌకపైనా 3 నుంచి 4 వేల టన్నుల బరువైన శకలాలు ఉన్నాయని, దీంతో అది అక్కడే చిక్కుకుపోయిం దని చెప్పారు. దాదాపు ఈఫిల్ టవర్ అంత పొడవైన ఆ భారీ నౌకను (984 అడుగులు)ను తరలించడం ప్రస్తుతం అత్యంత సవాల్‌తో కూడుకున్న పని అని పేర్కొన్నారు. ఇది చాలా క్లిష్టమైన ఆపరేషన్ అని తెలిపారు. ఘటనపై నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ దర్యాప్తు చేస్తోందని ఆయన వివరించారు. మార్చి 25న అర్ధరాత్రి దాటిన తర్వాత బాల్టిమోర్ వంతెనను నౌక ఢీకొట్టింది. ఈ నౌకలో ఆరుగురు భారతీ య సిబ్బంది ఉన్నారు. అయితే..
ప్రమాదాన్ని ముందే పసిగట్టి అధికారులను అప్రమత్తం చేయడంతో వంతెనపై రాకపోకలను నిలిపేయగలిగారు. దీని వల్ల ఎన్నో ప్రాణాలు
నిలిచాయని, లేకుంటే ఆ చీకట్లో వంతెన కూలిపోయిన తర్వాత కూడా వాహనాలు దూసుకొచ్చి నీళ్లలో పడిపోయేవని వెస్ మూర్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సైతం భారత సిబ్బందిపై ఇప్పటికే ప్రశంసలు కురిపించారు.



# సోషల్ మీడియాలో తమిళ తంబీలతో తగ్గేదేలే

ఇప్పుడు ఎక్కడ చూసినా పాన్ ఇండియా సినిమాలే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా స్టార్ హీరోలంతా పాన్ ఇండియా సినిమాలే చేస్తున్నారు. కానీ ఒకప్పుడు ఎక్కడ ఏ సినిమా హిట్ అయినా వెంటనే హక్కులు కొనుక్కొని వేరే ఇండస్ట్రీ వాళ్లు రీమేక్ చేసేవారు. అలా కోలీవుడ్-టాలీవుడ్ మధ్య ఎన్నో సినిమాలు రీమేక్ అయ్యాయి. అయితే అప్పటి సినిమాలపై సోషల్ మీడియాలో అప్పుడప్పుడూ ఫ్యాన్ వార్ జరుగుతూ ఉంటుంది. తాజాగా వెంకటేష్ 'ఆడవారి మటలకి అర్థాలే వేరులే' చిత్రంపై కోలీవుడ్ ఫ్యాన్స్ ట్రోల్స్ చేస్తున్నారు.

ఫ్యామిలీ ఆడియన్స్‌లో విపరీతమైన ఫాలోయింగ్ ఉన్న హీరో వెంకటేష్. అప్పుడెప్పుడో వచ్చిన 'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు' నుంచి ఇటీవల వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం వరకూ ఆయన చేసిన ఫ్యామిలీ సినిమాల లిస్ట్ చాలా పెద్దది. అయితే ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్‌లో ఆయన చేసిన ప్రతి సినిమా మంచి విజయం సాధించింది. ముఖ్యంగా సెంటిమెంట్ పండించడంలో వెంకటేష్ దిట్ట అన్న విషయం తెలిసిందే.

అసలు 'రాజా' సినిమా క్లైమాక్స్ ఎన్ని సార్లు చూసినా ఎమోషనల్ కాకుండా ఉండలేం. అంతలా తన నటనతో కట్టిపడేశారు వెంకీ. అలానే వెంకటేష్ కెరీర్‌లో 'ఆడవారి మాటలకి అర్థాలే వేరులే' చిత్రానికి కూడా ప్రత్యేకమైన స్థానం ఉంది. సెల్వ రాఘవన్ తెరకెక్కించిన ఈ చిత్రంలో వెంకీ సరసన త్రిష నటించింది. అప్పట్లో ఈ సినిమా సూపర్ హిట్ అయింది. ఈ చిత్రంలో పాటలు, వెంకటేష్ కామెడీ, అలానే సెంటిమెంట్ సీన్లలో నటన ఎవర్‌గ్రీన్ అనేలా ఉంటాయి.

అయితే 2007లో రిలీజైన ఈ చిత్రాన్ని ఏడాది తర్వాత ధనుష్ తమిళ్‌లో రీమేక్ చేశారు. 'యారాడి నీ మోహిని' పేరుతో వచ్చిన ఈ రీమేక్‌లో నయనతార హీరోయిన్‌గా నటించింది. అక్కడ కూడా ఈ సినిమా సూపర్ హిట్ అయింది. అయితే సోషల్ మీడియాలో తాజాగా కొంతమంది ధనుష్ ఫ్యాన్స్ యారాడి నీ మోహిని సినిమాలో ఎమోషనల్ సీన్లు షేర్ చేస్తూ 'ఒరిజినల్ కంటే బెటర్‌గా ఉంది' అంటూ కామెంట్లు చేస్తున్నారు. అంటే వెంకటేష్ కంటే ధనుష్ బాగా చేశాడని పోస్టులు పెడుతున్నారు.

ఇక ఈ పోస్టులు చూసిన వెంకీ ఫ్యాన్స్, టాలీవుడ్ ఆడియన్స్ ఘాటుగా బదులిస్తున్నారు. ధనుష్ గొప్ప నటుడే కానీ ఎమోషనల్ సీన్ల విషయానికొస్తే వెంకీ దరిదాపుల్లో కూడా ఏ హీరో నిలబడలేడంటూ పోస్టులు పెడుతున్నారు. ఇలా టాలీవుడ్ అంతా వెంకటేష్ వైపు నిల్చుంటే ధనుష్ ఫ్యాన్స్ వాళ్లతో ట్విట్టర్‌లో చిన్న సైజు యుద్ధమే చేస్తున్నారు. ధనుష్ అసురన్ సినిమాని వెంకటేష్ నారప్పగా రీమేక్ చేసి చెడగొట్టారంటూ పోస్టులు పెడుతున్నారు. మరోవైపు సూర్య చేసిన 'కాక కాక' చిత్రాన్ని ఘర్షణగా తీసి పాడు చేశారంటూ ఇష్టమొచ్చినట్లు పోస్టులు చేస్తున్నారు. ఇక వీటికి వెంకీ ఫ్యాన్స్ దీటుగా బదులిస్తున్నారు. నారప్పలో యాక్టింగ్ పరంగా వెంకీ సూపర్‌గా చేశారని.. అలానే కాక కాకలో సూర్య కంటే ఆ పాత్ర ఘర్షణలో వెంకీకే సూట్ అయిందంటూ పోస్టులు చేస్తున్నారు. ఇలా ధనుష్ వెంకీగా మొదలైన ఈ వివాదం.. కోలీవుడ్ టాలీవుడ్‌గా నడుస్తోంది. తమిళ తంబీలకి తగ్గేదేలే అంటూ రిప్లయ్ ఇస్తున్నారు మన ఆడియన్స్.

# ఇష్టమైన హీరోయిన్ ఎవరు..

బాలకృష్ణకి పద్మభూషణ్ అవార్డు రావడంపై ఆయన ఫ్యాన్స్ చాలా ఆనందపడ్డారు. ఇప్పటికే రాజకీయ, సినీ ప్రముఖులు చాలా మంది ఆయనకి శుభాకాంక్షలు కూడా చెప్పారు. ఇక బాలకృష్ణకి అవార్డు రావడంతో ఆయన చెల్లెలు నారా భువనేశ్వరి హైదరాబాద్‌లోని ఫామ్‌హౌస్‌లో తాజాగా ఓ పార్టీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాలయ్యని కూర్చోబెట్టి సరదాగా కొన్ని ప్రశ్నలు అడిగి ఆటపట్టించారు పురంధేశ్వరి, భువనేశ్వరి. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కూడా పాల్గొన్నారు.

అలానే మ్యూజిక్ డైరెక్టర్ తమన్, డైరెక్టర్లు అనిల్ రావిపూడి, మలినేని గోపీచంద్ కూడా ఈ పార్టీలో కనిపించారు. ఇక మీరు ఇప్పటివరకూ యాక్ట్ చేసిన హీరోయిన్లలో మీకు బాగా నచ్చిన ఒకరి పేరు చెప్పండి అంటూ భువనేశ్వరి అడిగారు. దీనికి బాలయ్య ఏం చెప్పారంటే?


ఈ ప్రశ్నకి సమాధానం చెప్పేందుకు బాలయ్య కాస్త ఇబ్బంది పడ్డారు. ఎవరి పేరు చెప్పినా వాళ్లతో మళ్లీ ఎఫైర్లు ఉన్నాయని అంటారు.. ఎందుకొచ్చింది అంటూ దాటవేశారు బాలయ్య. అయినా సరే నేనేం అనుకోను.. అర్థం చేసుకుంటాను ఒక్క పేరు మాత్రం





చెప్పు అంటూ అన్నయ్యని మళ్లీ ఇరికించారు భువనేశ్వరి. ఇంతలో ఎవరో కింద నుంచి 'వసు' (బాలయ్య భార్య) అంటూ అరిచారు. దీనికి అందరూ నవ్వుతుంటే వాళ్లు చెప్పినంత మాత్రాన వసుంధర పేరు చెప్తానా.. నువ్వు సినిమాలో అనలేదు కదా అయినా ఈ ప్రపంచమే ఒక వేదిక.. అందులో అందరం పాత్రధారులే.. కనుక వసుంధర కూడా నటే." అంటూ బాలకృష్ణ అన్నారు. అయినా కూడా వదలకపోయేసరికి చివరికి తన మనసులో మాట చెప్పారు బాలయ్య. తనకి బాగా ఇష్టమైన హీరోయిన్ విజయశాంతి అంటూ బదులిచ్చారు. అలానే ఇంకో ఇద్దరి పేర్లు కూడా చెప్పాలంటూ అడగ్గా రమ్యకృష్ణ, సిమ్రాన్ అంటూ చెప్పారు బాలయ్య. నిజానికి విజయశాంతి-బాలయ్య కాంబో అప్పట్లో ఓ ఊపు ఊపేసింది. విజయశాంతి-బాలయ్య మధ్య అప్పట్లో రూమర్స్ కూడా గట్టిగానే వచ్చాయి. వీరిద్దరూ కలిసి దాదాపు 17 సినిమాలు చేశారు. కథానాయకుడు, పట్టాభిషేకం, ముద్దుల క్రిష్ణయ్య, దేశోద్ధారకుడు, అపూర్వ సహోదరులు, భార్గవ రాముడు, మువ్వగోపాలుడు, భానుమతి గారి మొగుడు, భలే దొంగ, ముద్దుల మావయ్య.. ఇలా వీళ్ల కాంబోలో వచ్చిన చిత్రాల్లో దాదాపు 90 శాతం సినిమాలు సూపర్ హిట్ అయ్యాయి. టాలీవుడ్‌లోని బ్లాక్ బస్టర్ కాంబోల్లో బాలయ్య-విజయశాంతి జోడీ కూడా ఒకటి.

# 'పుష్ప 2' రీలోడెడ్ వెర్షన్ చూసి ఏడ్చేసిన అల్లు శిరీష్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన సినిమా 'పుష్ప 2: ది రూల్'. మూడేళ్ళ క్రితం వచ్చిన 'పుష్ప: ది రైజ్' చిత్రానికి సీక్వెల్ ఇది. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించింది. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఎన్నో రికార్డులు బ్రేక్ చేసింది.. కలెక్షన్స్ పరంగా సరికొత్త రికార్డులు సృష్టించింది. ఇటీవలే రీలోడెడ్ వెర్షన్ ను ఓటీటీలో రిలీజ్ చేయగా.. ఆడియన్స్ నుంచి అనూహ్య స్పందన లభించింది. అయితే ఈ వెర్షన్ చూసి ఏడ్చేశానని హీరో అల్లు శిరీష్ తెలిపారు.

గతేడాది డిసెంబర్ ఫస్ట్ వీక్ లో 'పుష్ప 2: ది రూల్' సినిమా థియేటర్లలో విడుదలైంది. దీనికి అదనంగా మరో 20 నిమిషాలు ఫుటేజీని జోడించి, సంక్రాంతి తర్వాత రీలోడెడ్ వెర్షన్ ను రిలీజ్ చేసారు. ఈ క్రమంలో మరో 4 నిమిషాలు యాడ్ చేసి నెట్ ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా ఈ మధ్యనే స్ట్రీమింగ్ చేసారు. బన్నీ సోదరుడు అల్లు శిరీష్ తాజాగా ఓటీటీలో ఈ సినిమా చూసి, ఇన్స్టాగ్రామ్ లో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. థియేట్రికల్ వెర్షన్ లో మిస్సయిన లింక్స్ అన్నిటినీ కవర్ చేసారని అన్నారు.

'పుష్ప 2' క్లైమాక్స్ లో పుష్పరాజ్ తన ఇద్దరు స్టెప్ బ్రదర్స్ ని పట్టుకొని ఏడుస్తున్న సన్నివేశాన్ని ఫోటో తీసి అల్లు శిరీష్ ఇన్స్టా స్టోరీలో పంచుకున్నారు. "రీలోడెడ్ వెర్షన్ చాలా హై ఇచ్చింది. సినిమా చివరి వరకూ కన్నీళ్లు వచ్చాయి. థియేట్రికల్ వెర్షన్ లో మిస్ అయిన లింక్స్ అన్నీ ఇక్కడ కవర్ చేయబడ్డాయి" అని పోస్ట్ లో రాసుకొచ్చారు. ఇది ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. 'పుష్ప 2' చిత్రం ముందుగా 3 గంటల 20 నిమిషాల నిడివితో థియేటర్లలోకి వచ్చింది. ఫైనల్ గా ఓటీటీలోకి వచ్చేసరికి ఈ సినిమా రన్ టైం 3 గంటల 40 నిమిషాలు అయింది. ఇటీవల కాలంలో ఇదే అతి పెద్ద తెలుగు సినిమా. 1977లో వచ్చిన 'దాన వీర సూర కర్ణ' చిత్రం ఇప్పటి వరకూ 3 గంటల 46 నిమిషాలతో లాంగెస్ట్ తెలుగు మూవీగా చరిత్రకెక్కింది. ఇప్పుడు 'పుష్ప 2: ది రూల్' రీలోడెడ్ వెర్షన్ రెండో స్థానంలో నిలిచింది. లవకుశ, సువర్ణ సుందరి, పాండవ వనవాసం, పాతాళ భైరవి లాంటి అలనాటి క్లాసిక్ మూవీస్ రన్ కూడా 'పుష్ప 2' కంటే తక్కువే ఉండటం గమనార్హం.

'పుష్ప 2' సినిమాలో అల్లు అర్జున్ సరసన రష్మిక మందన్న హీరోయిన్ గా నటించింది. ఫహాద్ ఫాజిల్, జగపతిబాబు, రావు రమేష్, సునీల్, అనసూయ భరద్వాజ్, జగదీష్, అజయ్, బ్రహ్మాజీ, ఆడుకాలం నరేన్, జగదీశ్, మైమ్ గోపి, శ్రీతేజ్, తారక్ పొన్నప్ప తదితరులు కీలక పాత్రలు పోషించారు. శ్రీలీల స్పెషల్ సాంగ్ లో ఆడిపాడింది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూర్చిన ఈ చిత్రానికి క్యూబా సినిమాటోగ్రఫీ నిర్వహించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై నవీన్ ఎర్నేని, వై.రవి శంకర్ భారీ బడ్జెట్ తో నిర్మించారు. బాక్సాఫీస్ దగ్గర రూ.1800 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టింది.

# టైటిల్ మార్చేసి రిలీజ్ చేస్తున్న సిద్ధూ జొన్నలగడ్డ

టాలీవుడ్ లో క్యారక్టర్ ఆర్టిస్టుగా కెరీర్ ప్రారంభించి, హీరోగా నిలదొక్కున్న వారిలో సిద్ధూ జొన్నలగడ్డ ఒకరు. 'గుంటూరు టాకీస్' సినిమాతో జనాల దృష్టిలో పడిన సిద్ధూ.. ఆ తర్వాత సురేశ్ ప్రొడక్షన్స్ లో 'కృష్ణ అండ్ హిజ్ లీలా' అనే మూవీ చేసాడు. డైరెక్ట్ ఓటీటీలో విడుదలైన ఈ సినిమా యూత్ ఆడియన్స్ కి బాగా నచ్చేసింది. అయితే ఓటీటీలో వచ్చిన ఐదేళ్లకు ఇప్పుడు ఈ చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకురావడానికి నిర్మాత రానా దగ్గుబాటి ప్లాన్ చేసారు.

'డీజే టిల్లు' సినిమాతో తెలుగు ఇండస్ట్రీలో క్రేజీ హీరోగా మారిపోయాడు సిద్ధూ జొన్నలగడ్డ. 'టిల్లు స్క్వేర్' చిత్రంతో 100 కోట్ల మైల్ స్టోన్ క్లబ్ లో చేరిపోయాడు. ప్రస్తుతం పలు ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్ లో నటిస్తున్నారు. అయితే కెరీర్ స్టార్టింగ్ లో అతను హీరోగా నటించిన చిత్రాల్లో 'కృష్ణ అండ్ హిజ్ లీలా' ఒకటి. దగ్గుబాటి రానా సమర్పణలో రూపొందిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్.. 2020 కోవిడ్ పాండమిక్ టైంలో డైరెక్ట్ ఓటీటీలో రిలీజయింది. అయితే దాదాపు ఐదేళ్ల తర్వాత ఇప్పుడు ఈ చిత్రాన్ని టైటిల్ చేంజ్ చేసి థియేటర్లలో విడుదల చేయబోతున్నారు.

'క్షణం' ఫేమ్ రవికాంత్ పేరేపు దర్శకత్వంలో 'కృష్ణ అండ్ హిజ్ లీలా' సినిమా తెరకెక్కింది. ఇందులో సిద్ధూ జొన్నలగడ్డ సరసన శ్రద్ధా శ్రీనాథ్, సీరత్ కపూర్, షాలిని వడ్నికట్టి వంటి ముగ్గురు అందాల భామలు హీరోయిన్లుగా నటించారు. సురేష్ ప్రొడక్షన్స్, వయాకామ్ 18 స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించాయి. థియేటర్లలో రిలీజ్ చెయ్యాలనే ఉద్దేశ్యంతోనే ఈ సినిమా తీశారు కానీ, కరోనా కారణంగా నేరుగా డిజిటల్ ఫ్లాట్ ఫామ్ లో విడుదల చేయాల్సి వచ్చింది. నెట్ ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా 2020 జూన్ 25వ తేదీ నుంచి స్ట్రీమింగ్ చేయబడింది. ఆ తర్వాత ఆహా ఓటీటీలోకి వచ్చింది. దీనికి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది.

'డీజే టిల్లు'తో సిద్ధూ యూత్‌లో మంచి ఫాలోయింగ్ ఏర్పడటంతో, ఆడియన్స్ అతని పాత సినిమాలను ఓటీటీలో చూడటం ప్రారంభించారు. వాటిల్లో 'కృష్ణ అండ్ హిజ్ లీలా' మూవీ విపరీతంగా ఆకట్టుకుంది. ఇలాంటి డిఫరెంట్ రోమ్ కామ్ ని బిగ్ స్క్రీన్ మీద ఎక్స్పీరియన్స్ చేయాలని సినీ ప్రియులు తరచుగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇన్నాళ్లకు సినిమాని థియేట్రికల్ రిలీజ్ కు రెడీ చేసారు. 'ఇట్స్ కాంప్లికేటెడ్' అనే పేరుతో వాలెంటైన్స్ డే స్పెషల్ గా ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. "టైటిల్ ఎందుకు మార్చామో అడగకండి. 'ఇట్స్ కాంప్లికేటెడ్' అంతే! ఊహించని డ్రామాతో ఫైనల్ గా ఈ ఫిబ్రవరి 14న థియేటర్లలో విడుదల అవుతుంది. మీ ప్రియమైన వారిలో ఒకరు లేదా ఇద్దరితో కలిసి సినిమా చూడండి" అని రానా ట్విట్టర్ ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. ఈ సందర్భంగా ఓ స్పెషల్ అనౌన్స్ మెంట్ వీడియోని షేర్ చేసారు. రానా, సిద్ధూ జొన్నలగడ్డ, రవికాంత్.. ఫన్నీ సంభాషణతో కూడిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో తనతో మరో సినిమా చేయమని రవికాంత్ అడగ్గా.. రానా దగ్గుబాటి నిర్మాతగా ఉంటే తాను చేయనని సిద్ధూ చెబుతాడు. రానా సినిమాని థియేటర్లలో రిలీజ్ చేయడని, ఇంగ్లీష్ పండుగైన వాలెంటైన్స్ డేకి 'ఇట్స్ కాంప్లికేటెడ్' చిత్రాన్ని విడుదల చేస్తే అప్పుడు తన బ్యానర్ లో మరో మూవీ చేస్తానని అంటాడు. థియేట్రికల్ రిలీజ్ చేయడమే కాదు, 'స్టార్ బాయ్' అనే ట్యాగ్ కూడా వేస్తానని రానా చెబుతాడు. అలా అయితే హీరోయిన్లతో కలిసి మూవీ ప్రమోషన్స్ చేయడానికి కూడా రెడీ అని సిద్ధూ బదులిస్తాడు. రెండు ఓటీటీలలో స్ట్రీమింగ్ చేయడం ఇల్లీగల్ అని, పాత టైటిల్ అసలు తమకు గుర్తే లేదంటూ సరదాగా సాగిన ఈ వీడియో ఆకట్టుకుంటోంది. యూత్ ఆడియన్స్ టార్గెట్ గా, పేరు మార్చుకొని మరీ వస్తోన్న 'కృష్ణ అండ్ హిజ్ లీలా' సినిమాకి ఎలాంటి ఆదరణ లభిస్తుందో చూడాలి.



# గోవాలో టాలీవుడ్ నిర్మాత ఆత్మహత్య..



టాలీవుడ్ నిర్మాత కృష్ణ ప్రసాద్ గోవాలో ఆత్మ హత్య చేసుకున్న ఘటన అందరినీ కదిలిస్తోంది. డ్రగ్స్ కేసు లోనూ ఇతగాడు ఇది వరకు అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు ఇతను గోవాలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మీద సుప్రిత స్పందించింది. చనిపోయిన వ్యక్తిని తల్చుకుని కన్నీరు మున్నీరు అవుతోంది. ఈమేరకు సుప్రిత వేసిన పోస్ట్ అందరినీ కదిలిస్తోంది.

టాలీవుడ్ నిర్మాత కృష్ణ ప్రసాద్ ఆత్మహత్య చేసుకున్నారనే వార్త ఒక్కసారిగా వైరల్ అవుతోంది. గోవాలో నిర్మాత కృష్ణ ప్రసాద్ సూసైడ్ చేసుకున్నాడని మీడియాలోనూ వార్తలు వస్తున్నాయి. ఇది వరకు డ్రగ్స్ కేసులోనూ అరెస్ట్ అయ్యాడని అంటున్నారు. ఇక కృష్ణ ప్రసాద్ గురించి ఇతర వివరాలు ఎవ్వరికీ అంతగా తెలియడం లేదు. అసలు ఇంతకీ ఇతను ఏ సినిమాలు చేశాడు? ఇంత వరకు తీసిన సినిమాలేవైనా బయటకు వచ్చాయా? అన్నది కూడా తెలియడం లేదు. కానీ తాజాగా సుప్రిత ఈ వ్యక్తి గురించి వేసిన పోస్ట్ మాత్రం అందరినీ కదిలిస్తోంది.

సొసైటీ ఫెయిల్డ్ హియర్ అంటూ బ్రోకెన్ హార్ట్ ఎమోజీని పెట్టి పోస్ట్ వేసింది. జీవితాంతం నిన్ను మిస్ అవుతూనే ఉంటాం అన్నా.. నా బాధలు ఎవరికి చెప్పుకోవాలి.. నీ బాధలు వినడానికి నేను లేకుండా చేశావ్ కదా అన్నా.. ఈ సోదరి నీకు ఎల్లప్పుడూ అండగానే ఉంటుందన్నా.. ప్లీజ్ త్వరగా తిరిగి రా అన్నా.. మిస్ యూ కేపీ అన్నా.. నువ్వు ఎక్కడున్నా టైగరే అంటావు గా.. నీ ఆత్మకు శాంతి కలగాలి అన్నా.. అంటూ సుప్రిత వేసిన పోస్ట్ అందరినీ కదిలిస్తోంది. మరి ఈ కృష్ణ ప్రసాద్‌కి సుప్రితకి ఎక్కడ ఎలా పరిచయం ఏర్పడిందని తెలియడం లేదు. ఇక సురేఖా వాణి సైతం ఈ వార్త మీద స్పందిస్తుందో చూడాలి. కృష్ణ ప్రసాద్ డ్రగ్స్ కేసులోనూ అరెస్ట్ అవ్వడం అందరికీ తెలిసిందే. ఇక అప్పులు, ఇతర ఆర్థిక సమస్యలు, ఈ డ్రగ్స్ కేసులతో డిప్రెషన్‌లోకి వెళ్లి ఇలాంటి నిర్ణయం తీసుకుని ఉంటారని అంతా అనుకుంటున్నారు.

సుప్రిత ప్రస్తుతం సిల్వర్ స్క్రీన్ మీదకు వచ్చేందుకు రెడీ అవుతోంది. అమర్ దీప్‌తో కలిసి సుప్రిత ఓ మూవీని చేస్తోంది. అది కంప్లీట్ కాక ముందే మరో ప్రాజెక్టుని కూడా రెడీగా పెట్టినట్టుగా సమాచారం. వరుసగా చిత్రాలు చేస్తూ సుప్రిత ఇక సిల్వర్ స్క్రీన్ మీద సత్తా చాటాలని గట్టిగానే ఫిక్స్ అయిందనిపిస్తోంది.

# నా తప్పే.. క్షమించండి...



టాలీవుడ్ లో కలర్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్స్ తో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు కృష్ణ వంశీ. గతంలో 'గులాబీ' 'నిన్నే పెళ్లాడతా', 'సింధూరం', 'అంతఃపురం', 'మురారి', 'ఖడ్గం', 'చందమామ' లాంటి మెమరబుల్ మూవీస్ తీశారు. గత కొన్నేళ్లుగా ఆశించిన విజయాలు అందుకోలేకపోతున్నారు. ఇక తాజాగా ట్విట్టర్ ఎక్స్ లో చిట్ చాట్ నిర్వహించిన వంశీ.. ఫ్యాన్స్ అడిగే ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. భక్తి సినిమాలో హీరోయిన్ ని గ్లామర్ రోల్ లో చూపించడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు.

తెలుగు ప్రేక్షకులకు క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణ వంశీ గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు. కుటుంబ కథా చిత్రాలతో టాలీవుడ్ లో తనకంటూ ఓ మార్క్ క్రియేట్ చేసుకున్నారు. ఈ క్రమంలో ఎన్నో ఘన విజయాలు సాధించారు. అయితే గత కొన్నేళ్లుగా ఆయన తెరకెక్కించిన సినిమాలేవీ బాక్సాఫీస్ దగ్గర పెద్దగా ఆడలేదు. వైవిధ్యమైన కథలు, విభిన్నమైన జోనర్స్ ట్రై చేస్తున్నా వర్కౌట్ అవ్వడం లేదు. దీంతో కాస్త గ్యాప్ తీసుకున్న దర్శకుడు.. సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు అభిమానులతో టచ్ లో ఉంటున్నారు. తాజాగా ట్విట్టర్ లో నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు ఆసక్తికరమైన సమాధానాలు ఇచ్చారు.

కృష్ణవంశీ నుంచి సినిమా వచ్చి దాదాపు రెండేళ్లు దాటిపోవడంతో, ఆయన త్వరలోనే మంచి చిత్రంతో రావాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. కంప్లీట్ హర్రర్ జోనర్ లో ఓ మూవీ చేస్తే చూడాలని ఉందంటూ ఓ అభిమాని కామెంట్ పెట్టారు. దీనికి దర్శకుడు స్పందిస్తూ.. "నాకు కూడా హారర్ ఫిలిం చేయాలని చాలా ఇంట్రెస్ట్ ఉంది. చేద్దాం. వేరే లెవల్ లో ట్రై చేద్దాం. కొంచం టైం పడుతుంది" అని అన్నారు. అలాగే ఓ రాబరీ సినిమా కూడా చేయాలని మరో ఫ్యాన్ కోరగా.. "తప్పుని గొప్పగా కీర్తించకూడదు. అలాంటి సినిమాలు నేను చేయలేను.. చేయను కూడా. సినిమా అనేది ప్రజల మనస్సులలో తప్పుడు ఆలోచనలను రేకెత్తించకూడదు అని నేను భావిస్తున్నాను" అని బదులిచ్చారు.

'శ్రీ ఆంజనేయం' లాంటి భక్తి సినిమాలో హీరోయిన్ ఛార్మీని ఎందుకు అలా చూపించారు? అని మరో నెటిజన్ ప్రశ్నించగా.. అది తన తప్పేనని కృష్ణ వంశీ సమాధానమిచ్చారు. "తప్పేనండీ... క్షమించండి.. తీరని సమయాలు తీరని చర్యలు తీరని పనులు" అని రాసుకొచ్చారు. నితిన్, ఛార్మీ కౌర్ జంటగా కృష్ణవంశీ తెరకెక్కించిన చిత్రం 'శ్రీ ఆంజనేయం'. రెండు దశాబ్దాల క్రితం వచ్చిన ఈ ఫాంటసీ మూవీ ఫ్లాప్ అయింది. ముఖ్యంగా ఇందులో ఛార్మీ పాత్రను తీర్చిదిద్దిన విధానంపై అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. ఒక భక్తి సినిమాలో 'పూలగుమగుమ' లాంటి పాట పెట్టడం ఏంటని, దీంట్లో హీరోయిన్ గ్లామర్ డోస్ శృతిమించిందని దర్శకుడిని ట్రోల్ చేసారు. అయితే అలా చూపించడం తన తప్పేనని ఇన్నేళ్లకు అంగీకరించారు.

రామ్ గోపాల్ వర్మ శిష్యుడైన కృష్ణ వంశీ.. 1995లో 'గులాబీ' సినిమాతో దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. 'నిన్నే పెళ్లాడతా', 'సింధూరం', 'అంతఃపురం', 'సముద్రం', 'మురారి', 'ఖడ్గం', 'డేంజర్', 'రాఖీ', 'చందమామ', 'మహాత్మా' వంటి ఎన్నో మంచి సినిమాలకు ప్రేక్షకులకు అందించారు. అయితే 2011 తర్వాత వచ్చిన 'మొగుడు', 'పైసా', 'గోవిందుడు అందరివాడేలే', 'నక్షత్రం' లాంటి చిత్రాలు డిజాస్టర్లుగా మారాయి. ఆరేళ్ళ విరామం తర్వాత తీసిన 'రంగమార్తాండ' చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది కానీ, కమర్షియల్ గా సక్సెస్ సాధించలేదు. ప్రస్తుతం ఎనిమిది తొమ్మిది కథలు రాస్తున్నాని, అవన్నీ ప్రాసెస్ లో ఉన్నాయని దర్శకుడు చెబుతున్నారు.